క్లుప్తంగా

వైభవంగా ఆలయాల ప్రారంభోత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తూరు: పట్టణంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ ఆలయాల ప్రారంభోత్సవం శుక్రవారం కనుల పండువగా సాగింది. మూడు రోజుల పాటు సాగే కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు వేద పండితులు యజ్ఞ, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

శంకర్‌పల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం శంకర్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ ప్రదీప్ ఓ ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల రోడ్డు ఫీడర్ వైపు ఉదయం 10 నుంచి 1గంటల వరకు, హైదరాబాద్ రోడ్డు ఫీడర్ వైపు మధ్యాహ్నం 3నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని స్పష్టం చేశారు. వినియోగదారులు ముందస్తు ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు.

వేడుకగా పోచమ్మ బోనాలు



ఊరేగింపులో పాల్గొన్న కొందుర్గు గ్రామస్తులు

కొందుర్గు: మండల కేంద్రంలో శుక్రవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి పసుపు, కుంకుమ, వేప కొమ్మలతో అలంకరించిన బోనాలను తలపై పెట్టుకొని మేళతాళాల మధ్య ఊరేగింపుగా బయలుదేరారు. ఈ ఉత్సవాల్లో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



3వ వార్డులో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

శంకర్‌పల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహించగా.. ఆయన పాల్గొన్నారు. అనంతరం మురుగునీటి కాలువలు, గుంతల వద్ద నిలిచిన నీరు, చెత్త, చెదారాన్ని తొలగింపజేసి కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా ప్రబలే అవకాశం అధికంగా ఉండడంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదే విధంగా ఇంటి పరిసరాల్లోని మురికి కాలువలు, గుంతలు, చెత్త, చెదారం ఎప్పటికప్పుడూ శుభ్రం చేసుకోవాలని, లేకపోతే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో టీపీఓ భాస్కర్, మేనేజర్ అంజన్‌కుమార్, సిబ్బంది అనూష, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు



పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్‌ఐ వెంకటేశ్

ఆమనగల్లు: డ్రగ్స్, గంజాయిలాంటి మత్తు పదార్థాలను నిర్మూలించి సమాజాన్ని కాపాడాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని ఠాణా ఆవరణలో శుక్రవారం డీవైఎఫ్‌ఐ రూపొందించిన 'డ్రగ్స్ నిర్మూలిద్దాం' పోస్టర్లను డీవైఎఫ్‌ఐ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని కోరారు.

భయపెడుతున్న బీపీ, షుగర్

- రోజు రోజుకూ పెరుగుతున్న వ్యాధి పీడితులు
- చిన్న వయసులో చుట్టుముడుతున్న వైనం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



షాబాద్: పూర్వకాలంలో వృద్ధాప్యం వచ్చాక రోగాలు చుట్టు ముట్టేవి. ఆధునిక జీవనశైలితో ప్రస్తుతం 30 ఏళ్ల వయసులోనే వ్యాధులు ముప్పేట దాడి చేస్తున్నాయి. వాతావరణం, ఆహారం, నీరు, ధ్వని, వాయు కాలుష్యాల కారణంగా ప్రజలు ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడుపుతున్నారు. దీంతో 30 ఏళ్లు రాగానే మధుమేహం(షుగర్), అధిక రక్తపోటు(బీపీ) బారిన పడుతున్నారు.

సర్వేలో వెల్లడి

జిల్లాలో మెట్రో సిటీ కల్చర్ వచ్చేసింది. ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌తో పాటు అన్ని రకాల ఆహార పదార్థాలు అందుబాటులోకి వచ్చాయి. ఇంట్లో వంటలు పక్కనబెట్టి, రెడీమెడ్ ఫుడ్ వైపునకు జనాలు పరుగులు తీస్తున్నారు. దీంతో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ముఖ్యంగా బీపీ, షుగర్ వెంటాడుతున్నాయి. వైద్యారోగ్యశాఖ ఇటీవల ఇంటింటి సర్వే చేపట్టగా షుగర్, బీపీ బాధితులు అధిక సంఖ్యలో ఉన్నట్లు గుర్తించారు.

భారీగా రోగుల సంఖ్య

చిన్న వయసులోనే ప్రజలు బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడటంపై వైద్యనిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి అవగాహన కలిగి ఉండి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 30 ఏళ్ల వయసు దాటిన షుగర్‌తో బాధపడుతున్న వారు 74,564 మంది, అధిక రక్తపోటుతో నలిగిపోతున్న వారు 68,398 మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. వీరు కాకుండా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇంతకు రెట్టింపు సంఖ్యలో బాధితులు వైద్యం పొందుతున్నట్లు సమాచారం.

వ్యాయామంతో ఆరోగ్యం

హెచ్‌బీఏ1సీ పరీక్ష చేయించుకుంటే మధుమేహం(షుగర్) ఉందో లేదో తెలుస్తుంది. ఉదయాన్నే పరగడుపున ఏమీ తినకుండా, తాగకుండా తీసిన రక్తంలో షుగర్ 100లోపు ఉంటే వ్యాధి లేనట్లు, 100 నుంచి 126లోపు ఉంటే ప్రీడయాబెటిక్ దశలో ఉన్నట్లు. ఈ దశలో జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి రాదు. 126 దాటితే వ్యాధి ఉన్నట్లు లెక్క. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే షుగర్‌ను కంట్రోల్‌లో ఉంచవచ్చు.

హైబీపీకి చెక్ పెట్టొచ్చు

ఉరుకుల, పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి వల్ల, కొన్నిసార్లు వంశపారంపర్యంగా బీపీ వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఆహారంలో ఉప్పు, కారం, మసాలాలు తగ్గించాలి. బీపీ 120 బై 80కి మించకుండా చూసుకోవాలి. 60 ఏళ్లు దాటిన వారికైతే 130బై 90 ఉన్నా పర్వాలేదు. అంతకు మించి ఉంటే హైపర్ టెన్షన్ ఉన్నట్లే, బీపీని నిర్లక్ష్యం చేస్తే బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్‌కు వచ్చే అవకాశం ఉంది. మందులతోపాటు మెడిటేషన్ చేస్తేనే దీనికి చెక్ పెట్టవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

హార్ట్, బ్రెయిన్‌స్ట్రోక్



హై బీపీ ఉన్నవారు హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే అవకాశం ఎక్కువ ఉంటుంది. అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు ఆందోళన చెంది బీపీ పెరుగుతుంది. క్రమం తప్పకుండా చెక్ చేసుకుంటూ మందులు వాడుతూ, ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి.

– విజయలక్ష్మి, వైద్యురాలు, పీహెచ్‌సీ, షాబాద్

కిడ్నీలకు ఎఫెక్ట్



దీర్ఘకాలికంగా మధుమేహం ఉన్నవారు కిడ్నీ జబ్బుల బారిన పడే అవకాశం ఎక్కువ ఉంటుంది. వ్యాధి వచ్చిన ఏడు నుంచి పదేళ్లలో మూత్రపిండాలు దెబ్బతింటాయి. ఊబకాయులకు సైతం ఈ ప్రమాదం ఉంటుంది. మధుమేహం రోగులు కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

– దామోదర్, జిల్లా ఉపవైద్యాధికారి

ఆర్‌ఎంపీలు పరిధి దాటొద్దు

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



గ్రామీణ వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఎంపీలు తమ పరిధి దాటి వైద్యం చేయొద్దని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. కొత్తూరు బాలిక అబార్షన్ ఘటన నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి పాటు గ్రామీణ వైద్యులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణవైద్యులు ప్రభుత్వ నిబంధనలకు అనుసరించి పేదలకు చికిత్సలు చేయాలన్నారు. కొందరు ఆర్‌ఎంపీలు అవలంబిస్తున్న తీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్తూరులో జరిగిన ఘటనలో ఓ గిరిజన బాలికకు అబార్షన్ చేసిన ఘటన సభ్య సమాజానికి తలవంపుగా ఉందన్నారు. ఆర్‌ఎంపీలు పేదల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని చికిత్సలు చేయొద్దన్నారు. కేవలం ప్రథమ చికిత్సలు మాత్రమే నిర్వహించి మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, గ్రామీణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి

- పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల విద్యార్థుల ర్యాలీ



ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తున్న మెడికల్ విద్యార్థులు

చేవెళ్ల: దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులపై దాడులకు పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థిపై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా కళాశాల సీనియర్ డాక్టర్లు, ఫ్యాకల్టీ, విద్యార్థులు చేవెళ్లలో భారీ ర్యాలీ శుక్రవారం చేపట్టారు. ప్లకార్డులు చేతబూని విద్యార్థులు కళాశాల నుంచి ప్రధాన చౌరస్తా వరకు సాగిన ర్యాలీలో హత్యాచారాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వైద్యవిద్యార్థులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రాణాలు కాపాడాల్సిన డాక్టర్ వృత్తిలో ఉన్న వారికే రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ దాడులను అరికట్టాలన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డా.పి.వి సత్యనారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జోయారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వర్‌రావు, సీనియర్ ఫ్యాకల్టీ, పీజీ విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దేహ దారుఢ్యానికి క్రీడలు దోహదం

- కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న భీంభరత్, సత్యనారాయణ

మొయినాబాద్‌రూరల్: క్రీడలు ఆడడంతో శరీర దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. మండలంలోని తోల్‌కట్టలో మాజీ సర్పంచ్ బొలిగిద్ద సత్యనారాయణ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మండల స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీ ముగింపు సమావేశంలో భీంభరత్ పాల్గొని విజేతలకు నగదు, షీల్డ్‌లు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల వైపు ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, అమీద్‌ఖాన్, రవీందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, మల్లేశ్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మిక సమస్యలు పరిష్కరించండి

మంచాల: గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సీతారాములు పేర్కొన్నారు. 18న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న గీతన్నల చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం మంచాల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కల్లు గీత కార్మిక సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ సంవత్సరం ఆగస్టు 16 తేదీ నుంచి 18వ తేదీ వరకూ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గీతన్నల చైతన్య యాత్ర నిర్వహించనున్నామని తెలిపారు.

మాడ్గులలో..

మాడ్గుల: సర్వాయి పాపన్న గౌడ్ జయంతికి తరలిరావలని ఉత్సవ కమిటీ చైర్మన్ కొత్త పాండు గౌడ్, కన్వీనర్ జగన్ గౌడ్ పిలుపునిచ్చారు. అవురుపల్లి గ్రామం నుంచి పాపన్న గౌడ్ శోభయాత్ర మండల కేంద్రం వరకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

అటల్‌జీ సేవలు స్మరిస్తూ.. నీరాజనం



మొయినాబాద్: మాజీ ప్రధాని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్ల: దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన మహానేత అటల్ బిహారీ వాజ్‌పేయీ అని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం దివంగత ప్రధాని, భారతరత్న వాజ్‌పేయీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించి ప్రజల గుండెల్లో గొప్ప నాయకుడిగా కీర్తి గడించిన దార్శనికుడన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, అల్లవాడ శ్రీనివాస్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, గణేశ్, జయసింహరెడ్డి, నవీన్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: వాజ్‌పేయీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

వాజ్‌పేయికి ఘన నివాళి

మొయినాబాద్: మాజీ ప్రధాని వాజ్‌పేయీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మొయినాబాద్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. నివాళులర్పించినవారిలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయండి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయాలని బీజేపీ యువ నాయకుడు కర్రెడ్ల నరేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో శుక్రవారం కోరారు. ఆగస్టు 15లోపు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయినా రైతులందరికీ రుణమాఫీ జరగలేదని ఆయన ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని ముఖ్యమంత్రి వెంటనే రైతులకు క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

బంద్ ప్రశాంతం

తుక్కుగూడ: బంగ్లాదేశ్‌లో హిందువులపై చేస్తున్న దాడులను నిరసిస్తూ శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. శ్రీశైలం జాతీయ రహదారిపై వ్యాపార, వాణిజ్య సంస్థలు మూసి వేయించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ మాట్లాడారు. బంగ్లాదేశంలో హిందువులను వేధించడం బాధాకరమన్నారు.

సిరిసంపదల తల్లి.. భక్తితో ప్రణమిల్లి

ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి.. మా ఇంటికి రావమ్మ మహాలక్ష్మి అంటూ గౌరమ్మకు మంగళహారతి పట్టారు. శ్రావణమాసంలో మహిళలు లక్ష్మీదేవికి అత్యంత భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని చేస్తారు. శుక్రవారం ఉదయం నుంచే అతివలు, యువతులు చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల పరిధిలోని ఆలయాలకు క్యూ కట్టారు. సంప్రదాయ దుస్తులు ధరించి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

- ఆలయాలకు పోటెత్తిన మహిళలు, యువతులు
- ఘనంగా వరలక్ష్మీవ్రత ప్రత్యేక పూజలు



మొయినాబాద్‌రూరల్: పూజలో పాల్గొన్న మహిళలు

చేవెళ్ల: మండలంలోని ప్రజలు శుక్రవారం వరలక్ష్మీవ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని ఆలయాల్లో వరలక్ష్మీవ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, కొనగట్టు శివాలయంలోని భ్రమరాంబదేవి, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు.

షాబాద్‌లో సామూహిక వ్రతం

షాబాద్: మండలంలో వరలక్ష్మీ వ్రతం పూజలు ఘనంగా నిర్వహించారు. శిశు మందిర్ పాఠశాలలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో దేవాలయాల వద్ద మహిళలు వరలక్ష్మి వ్రతాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

పూలు, పండ్లతో నైవేద్యం

మొయినాబాద్‌రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లోని మహిళలు వారి వారి ఇళ్లల్లో లక్ష్మీదేవి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు ఏర్పాటు చేసిన పూజల్లో పూలు, పండ్ల నైవేద్యంతో పాటు తొమ్మిది రకాల పిండి వంటకాలను సమర్పించారు.



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో కొలువుదీరిన అమ్మవారు



చేవెళ్ల: సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు



షాబాద్: శిశు మందిర్ పాఠశాలలో సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

కేటీఆర్ వ్యాఖ్యలపై ఆగ్రహ జ్వాలలు

- మహిళలను కించపరిచినందుకు బుద్ధి చెప్పాలి
- కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్



నందిగామ: రోడ్డుపై నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

షాబాద్: మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన కేటీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ముంబయి–బెంగళూరు లింక్ జాతీయ రహదారిపై కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు రికార్డింగ్ డ్యాన్స్‌లు, అల్లికలకు ఉపయోగిస్తున్నారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. పేద, మధ్య తరగతి మహిళాభివృద్ధిని ఓర్వలేని కేటీఆర్‌కు మహిళలే తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఉచిత ప్రయాణ సౌకర్యం ద్వారా ప్రయాణించే మహిళలపై చేసిన వ్యాఖ్యలను తిరిగి వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రామ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు నర్సింహులు, చెన్నయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అశోక్, నాయకులు రవీందర్, మాధవరెడ్డి, హస్మత్ పాషా, రాహుల్‌గుప్తా, వెంకట్‌రెడ్డి, అక్తర్‌పాషా, శ్రీరాంరెడ్డి, అశ్వక్‌అలీ, రాంచందర్, శ్రీను, శివకుమార్, నర్సింహులు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

నందిగామ: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్ దిష్టి బొమ్మను కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం నందిగామలోని పాత జాతీయ రహదారిపై దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర మహిళల సంక్షేమం కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే బీఆర్ఎస్ పార్టీ జీర్ణించుకోలేక పోతుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు చంద్రపాల్‌రెడ్డి, కృష్ణ, నాయకులు బాల్‌రెడ్డి, నర్సింహులు, బుచ్చయ్య, జంగయ్యగౌడ్, రాములు, సుమన్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న భీంభరత్, నాయకులు



కొత్తూరు: రహదారిపై కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మహిళలకు క్షమాపణలు చెప్పాలి

కొత్తూరు: పట్టణంలో శుక్రవారం కాంగ్రెస్ నేతలు కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని వర్ణిస్తూ నృత్యాలు చేసుకోవచ్చని అనడం సిగ్గుచేటన్నారు. కేటీఆర్ బహిరంగంగా మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, జనార్దన్‌చారి, శ్రీను, నర్సింహ, తేజేశ్వర్, హసన్, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలు సరికావు

మొయినాబాద్: మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం మండల కేంద్రంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. మహిళల పట్ల ఇష్టానుసారంగా మాట్లాడితే కేటీఆర్‌కు పుట్టగతులు ఉండవని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, పీసీసీ అధికార ప్రతినిధి సతీష్, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, నాయకులు పుష్పలత, రాములు, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, వీరభద్రస్వామి, రాంరెడ్డి, కేబుల్‌రాజు, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రాజు, సురేష్ పాల్గొన్నారు.



మొయినాబాద్: కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు